# 2. రాజకీయం

చెట్టెక్కడంలాంటి పనులలవాటు లేకున్నా కష్టమవుతున్నా పట్టు దలగా చెట్టెక్కి శవాన్ని భుజంపై వేసుకొని చెట్టుదిగాడు త్రివిక్రమరావు శ్మశానం దిక్కు త్వరగా అడుగులేస్తున్న రావుతో భేతాళుడు,

"ఓ మానవా! నీ తలపైవున్న టోపీ, ఖద్దరులాల్చి నీ ఆకారం చూస్తుంటే నువ్వు రాజకీయాల్లో ఉన్నవాడిలా అగుపడుతున్నావు...... అవునా...?" అన్నాడు....

త్రివిక్రమరావు మౌనంగా నడుస్తున్నాడు—

"మనిషీ? నువ్వు చెప్పకున్నా నాకు తెలుసు—నీకు రాజకీయాల్లో ఓటమి తప్ప గెలుపన్నదే తెలియదు – నన్ను వశం చేసుకొని నాయ కుడివవాలనుకుంటున్నావు–"

అయినా త్రివిక్రమరావేం మాట్లాడలేదు— "నీ పట్టుదల ముచ్చ టగానే వుంది — నీకు నా బరువు తెలియకుండా ఉండడానికి నాయకుడ వడానికై గజనీ, ఘోరిల్లా ప్రయత్నించిన ఒకాయన కథ చెబుతాను. విను— నా ప్రశ్నలకు నువ్విచ్చే జవాబులను బట్టి నీ ప్రయత్నంలో ఎందుకు విఫలమవుతున్నావో కూడా చెబుతాను— " అని కథ చెప్పడం మొదలు పెట్టాడు భేతాళుడు.

దేశం వందలేండ్లుగా పరరాజుల పాలనలో ఉంది పరాయిపాలన నుండి దేశానికి విముక్తి కల్గించడానికై ప్రజలు నడుం కట్టారు—నాయ కులు ముందుకొచ్చారు స్వాతంత్ర్య పోరాటం ముమ్మరంగా సాగుతున్న

కాలంలో వెంకట్రావు విద్యార్థి- దేశనాయకుల ఉపన్యాసాలకు, వినాదాలచే ఆకర్షింపబడి చదువును వదిలిపెట్టాడు - స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని లాఠీదెబ్బలు బూటు తన్నులు తిన్నాడు జైలు కెళ్ళాడు — ఎందరో మహనీయుల త్యాగాల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యంవచ్చే సమయానికి వెంకట్రావు నూనూగుమీసాల నూత్న యవ్వనంలో వున్నాడు - వెంకట్రావు చాలా ఆనందించాడు స్వదేశీయుల పాలనలో తన దేశం ముందుకు పోతుందని దేశప్రజల కష్టాలు గట్టెక్కుతాయని కలలకన్నాడు

రాజకీయాలకు దూరంగా వుండి దేశస్థితిని, నాయకులను పరిశీలిస్తున్నాడు-అయితే ఎన్నిరోజులు గడిచినా తానాశించిన దేశాన్ని చూడలేకపోతున్నాడు—ప్రజలస్థితి మరింత అధ్వాన్నమవుతుంది — నాయకుల మాటలకు, చేతలకు పొంతన కనబడడంలేదు—అవినీతి, ఆశ్రిత పక్షపాతం, లంచగొండితనం లాంటి రుగ్మతలుకు రోజు రోజుకు పెరుగుతున్నాయి — దేశ ప్రజల తలసరి ఆదాయం తగ్గుతుంది ఈ పరిస్థితులను చూచి ఆవేదన చెందాడు — ఆందోళన చెందాడు...

రాజకీయాల్లోకిదిగి సేవ చేయాలనుకొని పార్టీలో చేరాడు —— పార్టీలో ప్రవేశం లభించినా పోటీ చేయడానికి సీటు మాత్రం అతనికెంతకూ లభించలేదు .... అందుక్కారణం అతడు ముక్కుసూటిగా ప్రవర్తించడం చెప్పింది చెయ్యాలని వాదించడం ఎన్నికల వాగ్దానాలను కొన్నయినా అమలు చేయాలనడం — అతని వాదనలు పార్టీ నాయకత్వానికి గిట్టక అందరికీ కంటగింపయ్యాడు — గూండాల్లాంటి వాళ్ళకు కూడా పార్టీటికెట్లు లభిస్తుంటే నైతిక విలువలు నమ్మి సేవచేస్తానన్న వెంకట్రావుకు సీటు రాకపోయేసరికి ఆవేదన చెందాడు — పార్టీనుంచి బయటకొచ్చాడు.

మరి రెండు పార్టీల్లోనూ చేరి చేదు అనుభవాలతో బయటకొచ్చాడు స్వతంత్ర అభ్యర్థిగా నైన పోటీచేసి గెలవాలనుకున్నాడు —తానొక్కడు ఏం చేయలేనని తెలిసినా న్యాయమైన సమస్యల విషయంలో — సభలో గొంతు విప్పడానికవకాశముంటుందని పోటీ చేయడం మొదలుపెట్టాడు. సైకిలుపై తిరుగుతూ ప్రచారం చేసాడు. కులమత ప్రాంతీయ దురహంకారత లను రెచ్చగొడుతూ ఓట్లు గుంజటాన్ని వ్యతిరేకించాడు — ఎన్నికల్లో మితంగా ఖర్చుచేయాలన్న నియమాన్ని అక్షరాల పాటించాడు- అయినా ఆతని కొక్కసారికూడా డిపాజిట్ అయినా దక్కలేదు.

ఈలోగా ఓకొత్తపార్టీ పుట్టుకొచ్చింది — నీతి, నిజాయితీలకు తామే ప్రతినిధులమని, ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడుతామని బహి రంగ సభల్లో చెప్పసాగాడు. నాయకుడు — ఎన్నికల్లో డబ్బు ప్రధాన పాత్ర వహించకూడదని, తమ పార్టీలో పేదలకు బలహీన వర్గాలకు అధిక ప్రాధాన్యముంటుందని చెప్పసాగారు —ఆ పార్టీ ప్రిన్సుపుల్స్ తనకు దగ్గరగా వున్నాయని నమ్మి అందులో చేరాడు వెంకట్రావు — ఇంతలో ఎన్నికలొచ్చాయి నీతి నిజాయితీలకు మారు పేరైన తనకు పార్టీ టికెట్టు తప్పక లభిస్తుందనుకున్నాడు — టికెటు కోసం ప్రయత్నిం చాడు కథ చెప్పటం ముగించాడు భేతాళుడు—

" ఓ మనిషీ! నీ రాజకీయ పరిజ్ఞానాన్నంతా ఉపయోగించి నా ప్రశ్నలకు జవాబు చెప్పి—

వెంకట్రావుకు టికెట్ లభించి నాయకుడయ్యాడా? అయితే ఎలా అయ్యాడు — ?

అయితే ఎలా అయ్యాడు-? కాకుంటే ఎందుకు కాలేకపోయాడు-? నీకు తెలిసినంత వరకైనా జవాబులు చెప్పకపోయావో నీవు శాశ్వతంగా నాయకుడివి కాకుండా శపిస్తాను"

భేతాళుడి ప్రశ్నలకు జవాబులు చెప్పసాగాడు త్రివిక్రమరావు— చాలా ఏళ్ళ నిరీక్షణ తర్వాత వెంకట్రావుకు తన ఆశయాలకు సరిపోయే పార్టీ కనిపించింది.... అందులో చేరి ఆనందించాడు — డబ్బు లేకుండా సీటుకు ప్రయత్నించాడు—తప్పకుండా అతనికి సీటు లభించివుంటుంది అతడు నాయకుడై తన ఆశయాల సాఫల్యం కోసం కృషి చేస్తుంటాడు.

ఆ మాటలకదోలా నవ్వాడు భేతాళుడు

"ఇన్నేళ్ళుగా రాజకీయాల్లోవుంటూ కూడా నువ్వు రాజకీయపార్టీల స్వరూప స్వభావాలను అర్థం చేసుకోలేకపోయావు. అందువల్లే రాణించడంలేదు—ప్రస్తుతం రాజకీయమంటే చెప్పడమేళాని చేయడంకాదు. ఎన్నికల వాగ్దానాలతో దేశంలోని జలాశయాలు నింపాలి — పథకాలన్ని కాగితాలపైనే ఉండాలి–ఆ కొత్తపార్టీ వీటికేం భిన్న కాదు – కాకపోతే భిన్నమని ప్రజలను నమ్మించింది – ఆ విషయాన్ని వెంకట్రావులాంటి వాళ్ళర్థం చేసుకోలేదు –ఉట్టి చేతుల్తో టికెట్ కోసం ప్రయత్నించాడు—

లక్షలు చూపందే టికెట్ రాదని తెలిసికొని ఆ తర్వాత బాధపడ్డాడు కంపు రాజకీయాలతో విరక్తిచెంది రాజకీయాలకు దూరంగా ఉండటానికే నిర్ణయించుకున్నాడు – నాయకుడివి కాదలుచుకుంటే దేశరాజకీయాల అసలు స్వరూపాన్ని అంచనా వేయడంలో తప్పటడుగులు వేయకు –" అని "నీవు జవాబు సరిగా చెప్పకున్నా మౌనభంగం కల్గింది కాబట్టి మాయమవుతున్నాను–" అని శవంతో సహా మాయమై చెట్టెక్కి కూర్చున్నాడు భేతాళుడు–

జనప్రభ సాహిత్య మాస పత్రిక జులై 1985